స్కెచ్

# కష్టార్జితం...

బి. బసవారెడ్డి

చాలామంది ఎగతాళి చేస్తూంటారు, బళ్లుతోలే కుర్రాళ్ళంతా: "ఏరా! రాగవయ్యా! ఇంకా ఎన్నాళ్లరగ్గొట్టదల్చుకున్నా తార్రోడ్లని, నీ కంచర గాడిద నాడాల్తో" అని.

"ఏడిచారులేంద్రా! మియ్యన్నీ తెగబల్చి కొట్టుకుంటుంటే నాగుర్రం కంచరగాడి దయ్యింది. ఒక్కగొవ్వ మేతలేక అట్లా వుందిగాని అదేం ముసిల్దా, ముతకదా?" అని వూరుకునేవాడు రాగవయ్య.

వాళ్లు తన గుర్రాన్ని "కంచర గాడిద" అని ఎగతాళి చెయ్యడంలో వాస్తవం లేకపోలేదని రాగవయ్యకు తెలుసు. తనకు పెళ్లయినప్పటి నుంచీ కూడా శకట భారంతో, సంసార భారాన్ని మోస్తూ వున్నమాట వాస్తవమే. మరి దీనికి పింఛను ఇస్తే బండి నడిచే దెట్లా? తను మాత్రం మొయ్యలేనంతగా బొజ్జా, గుండెమీద అరడు గెత్తున కండా పెంచుకొనున్నాడా అంటే అదీ లేదు. బొమికలకు చర్మం కప్పుకొని జీవిస్తున్న మనిషే. పదహారు కాకపోయినా-పదేళ్ళయినా దానికంటే ఎక్కువ వయస్సే వుంది తనకి. "ఇంకా ఏంబండి తోల్తావ్? మానేసెయ్యవోయ్!" అని తన్నెవరూ అన్న పాపాన పోలే దెందుకని? ఒక వేళ అన్నా- గవర్నమెంటు వుద్యోగులకైతే 'పింఛను' ఇచ్చి, డబ్బిస్తారు నెల కింతని. తన కెవళ్ళిస్తారు? అని ఆలోచనలో పడుతుంటాడు రాగవయ్య.

రాగవయ్యకి పదహారో ఏడు రాగానే రెండేళ్ల వ్యత్యాసంతో తల్లిదండ్రు లిద్దరూ చనిపోయారు. గర్వించటంమాట అట్లా వుంచి- "నాది" అని చెప్పుకోదగ్గ దార్శనికమైన వస్తువేదీ మిగల్చకుండా పోయారు వాళ్లిద్దరూ. మిగల్చటమేమిటి- అసలు సహజంగానే లేవు. నాలుగు సంవత్సరాల పైచిల్లరనుంచీ అనుభవం సంపాదించిన విద్య: రైలుదగ్గిర మూటల్ని, బరువుల్ని ఊళ్లోకి చారవేయటంద్వారా జీవిస్తూండేవాడు. నోట్లో నాలికలా అందరితో మంచితనంగా ఉంటూండేవాడు. రాగవయ్య తన విద్యద్వారా కొద్దో గొప్పో వెనక వేసుకొనే అలవాటు లేకపోలేదు గాని, దాన్ని దొమ్మరి గుడిసె మూలనున్న కావిడిపెట్టెలోకి చేరేస్తుండేది యౌవనోద్రేకం. అందువల్ల పెళ్లిచేసుకుందామనే కోరిక గొంతెమ్మ కోరికగానే వుండిపోయింది కొన్నాళ్లు. ఇరుగు పొరుగువాళ్లంతా చందా వేసుకొని ఎట్లాగైతేనేం పెళ్లి చేశారొక గంతకుదగ్గ బొంతని. పెళ్లి కాగా, మిగిలిన నాలుగు రువ్వల్తో ఒక పాతబండి కొని, ఎక్కణ్ణించో తప్పిపోయి వచ్చిన గుర్రప్పిల్ల ఒకటి అంతకు క్రితమే తన దగ్గర ఉన్నది కాబట్టి, దానికి బండి తగిలించి మెల్లిగా వ్యవహారం నడుపుకొస్తూండేవాడు బాడిగ డబ్బులతో. పెళ్లయిన కొత్తలో ఇద్దరికే చాలేది కాదు కొంప. అందులోనే అయిదుగురు ముడుచుకో వలసివచ్చిందిప్పుడు. గుడిసె మాత్రం ఒక్క అంగుళంకూడా పెరగలేదు-ఇదీ రాగవయ్య క్లుప్త జీవిత చరిత్ర.

* * *

ప్యాసెంజరు ట్రెయిన్ బాధ్యతారహితంగా పారవేసిపోయిన సజీవమైన సరుకు గేట్లల్లోంచి స్టేషనులోకి చేరుకుంటూండగానే బళ్ళవాళ్ళంతా ముట్టడించారు. పీలైనంత తక్కువకు ఎవళ్లు ఒప్పుకుంటారో వాళ్ళనెత్తిన పడేస్తున్నారు తమతో తెచ్చిన పెట్టీ బేడా—ప్రయాణీకులు. పెద్దమనిషితనాన్ని దుస్తుల్లో కనబరుస్తో, పొట్ట పగిలేటట్టుగా కుక్కిన హ్యాండ్ బ్యాగ్‌తో వొచ్చిందొక భారీవిగ్రహం. భారీవిగ్రహపు రాక బళ్ళవాళ్ల మొహాల్లో నెత్తుర్ని ఖాళీ చేసింది. అంతకుముందు ప్రయాణీకుల కడ్డం నిలబడి బాడిగని అర్థించే బళ్లవాళ్ళంతా మొహం తప్పించి దారిచ్చారా పెద్దమనిషి వెళ్ళిపోటానికి. ఆ ఊళ్లో

గొప్పగా పేరుమోగిన వకీలు; తలకాయలు మార్చటంలో మంచి అనుభవం గల చెయ్యి.

అలా వాళ్లంతా తన్ను చూసి తొలగిపోవటం "తన గౌరవానికి దోహదం చెయ్యటం" అనే ప్రయాణీకుల అభిప్రాయంలో నిజం లేదని వకీలు గారికి తెలుసు. మొదట మాట్లాడుకున్న కుదణాల బండి బాడిగనీ, అర్ధరూపాయ రొక్కరూపంలో ఇచ్చి, కనీసం తతిమ్మా బేడా చిల్లర లేదనే సాకుతో దబాయించి వాయిదా వేసే సంగతి ప్రయాణీకులకేం తెలుసు? చిల్లర ఉన్నదీ, లేనిదీ బళ్ళవాళ్ళ కేం తెలుసు—అంటానికి వీలు లేదు. అందుకే తన్ను చూసి ఇలా తప్పుకుంటున్నారు; ఆ చిల్లర ఎప్పటికీ తమకు ముట్టబోదని తెలుసుకుని. అయినా సంజవేళ నూకలకి చేతిలో దమ్మిడీ లేక అవస్థపడే రాగవయ్య తటస్థపడినాడు వకీలు గారికి.

"ఊం...పోనియ్ త్వరగా" అంటున్నాడు; వెనకనుంచి భూమి బ్రద్దలై పగులుకొంటూ వస్తూన్నట్టు, రాగవయ్య ఝాడించి కొట్టాడు తపీ మని గుర్రం వీపు చిట్లేలా. ఒక్కసారి వెనక కాళ్ళని పైకి లేపి దుమ్ము రేపుతో బయల్దేరింది గుర్రం. "అమృతసౌధ్" అని పేరుపెట్టుకొని శాశ్వతంగా స్వంతం చేసుకున్న భవనం ముందు బండి ఆగిన మరుక్షణం లోనే బండి దూకి ఇంటో జొరబడ్డాడు వకీల్ సాబ్; "రేపు రావోయ్! బాడి గిస్తాను" అంటో.

ఎకాయెకి కొంతదూరం పోయి, మలుపుతిప్పి గుడిసె చేరుకున్నాడు రాగవయ్య. సంజచీకట్లో గుర్రాన్ని కట్టివేసి. మేతకోసం బండిలోకి తొంగి చూచిన రాగవయ్య మొద్దుబారిపోటానికి కారణం: త నెప్పుడూ చూడని వస్తువును చూడటమే.

"అంత అదృష్టం ఏడిచిం దంటలే. ఇంకేదన్నా కాయితలేమో"అని సణుక్కొంటూ, గుడిసెలో జొరబడ్డాడు రాగవయ్య. "సుక్కీ! దీపం దీసుకురా!" అని కేకేశాడు, అదే పనిగా ఆ వస్తువు కేసి చూస్తో. దీపం వెలుతుర్లో-ఒకటో క్లాసు పాత చదువుని గట్టిగా గుర్తు దెచ్చుకుంటో - "వంద అంకే, సందేగం లేదు. ఒకటి పక్క రెండు సున్నాలు" అన్నాడు సుక్కి కళ్లలోకి చూస్తో. "ఓయమ్మో ఈ డబ్బంతా యాడదది?" అన్నది సుక్కి; గారడీవాడు కాయితాన్ని పాముసు చేసినప్పటిలాగ. "ఇది వంద రూపాయిలనోటే! సరిగ్గా చూడు!" అని సుక్కి చేతి కిచ్చాడు. సుక్కి తిప్పితిప్పి చూస్తోం దానోటుని వింతమృగాన్నిలా. "ఇందాకా పీడరు గారికి బండి కట్టా, ఆయన జేబుసులోంచి జారి పోయినట్టుగుంది. ఆడు కనుక్కొని సావచ్చాడంటలే. జేబుసునిండా కుక్కుకుని పోతున్నాడు ఇట్టాంటెయి బోలెడు" అన్నాడు; ఒక పక్క భయం గుండెల్లో కలుగుతున్నా.

ఒకవేళ వకీలు వచ్చి అడిగితే "నాకు తెల్దండీ! బండిలోగనపడ్తే గాలి కొట్టుకుపోయిందేమో" అని చెబుదా మనుకున్నాడు, 'లా' తెలవని పిచ్చి రాగవయ్య- "పాపపు సొత్తు నిలవదు" అని చేతల్లో కాకపోయినా-కొంతమంది పెద్ద మనుషులు మాటలతో చెప్పటం, కొన్ని కృత్రిమమైన ఈరకం గాథలూ రాగవయ్యకి గుర్తు వచ్చినా, వాటిని అణచటానికి పెద్దగా కసరత్ చెయ్యవలసిన అవసరం లేకుండానే, ఆ డబ్బుని దాచిపెట్టే నిర్ణయానికి వచ్చి గుడిసె అంతా కలయ చూస్తున్నాడు.

గుడిసెలోకి దుమ్ము కుమ్మరిస్తూ 'వేన్' నిలబడింది తన గుడిసెముందే. గాభరాతో నోటు సుక్కి చేతి కిచ్చి బయటికి వచ్చాడు రాగవయ్య. సబ్ ఇన్స్పెక్టరు, వకీలు, పోలీసు వరసగా దిగారు. పోలీసువాళ్ళని చూడగానే రాగవయ్యకి చెమటలు కమ్మినయ్.

"ఆ నోటేదోయ్! త్వరగా ఇచ్చెయ్! వెళ్ళిపోవాలి" అన్నాడు వకీలు.

"ఆ నో-టూ..."అనిఅంటుండగానే ఛెళ్లున వీపుమీద పడింది యస్. ఐ. కమిచీ.

ఇదంతా చూస్తున్న సుక్కి, కళ్ళంట నీళ్లు కారుస్తా "మేవేం గాసుకోలేద్దురా! తెచ్చిద్దా మనుకుండే లోపలే వొచ్చిన్రు మీరు" అంది తెలివిగా; చేతిలో నోటు ఆయనకిస్తూ గర్వంగా చూశాడు యస్. ఐ. వకీలుకేసి.

"కష్టపడిన సొమ్మయితే గంగలో పారేసినా పోదు" అన్నాడు వకీలు చిరునవ్వుతో.

"ఇంకానా బాడిగడబ్బు లిత్తాడా యీడు" అని సణుగుతూ, "కష్టపడిన సొమ్ము"కు అర్థం తెలియక ఆలోచిస్తో గుడిసెలో దూరాడు రాగవయ్య.